మోసకారి కాంగ్రెస్‌ను నిలదీద్దాం!

- మంత్రివర్గంలో మున్నూరుకాపులకు సముచిత స్థానం కల్పించలేదు
- కులగణనలోనూ కావాలనే సంఖ్య తగ్గించి చూపించారు
- ఈ కారణాలతో కాంగ్రెస్‌కు కృతజ్ఞత సభ ఎలా పెట్టగలం!
- కేసీఆర్ పాలనలో మున్నూరు కాపులకు ప్రాధాన్యం లభించింది
- రేవంత్‌పాలనలో గౌరవం దక్కడంలేదని మున్నూరుకాపుల ధ్వజం
- కాంగ్రెస్‌ను నిలదీయాలని తీర్మానించిన సంఘం నేతలు

అంబర్‌పేటలో మాట్లాడుతున్న బీహెచ్. చిత్రంలో ఆది శ్రీనివాస్, కే కేశవరావు, వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ)/అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ మున్నూరుకాపులను గుర్తించి, రెండుసార్లు మంత్రివర్గంలోకి తీసుకున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని మున్నూరుకాపు సంఘం నేతలు తీవ్రఅసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మున్నూరుకాపులను అసలు పరిగణనలోకే తీసుకోవడంలేదనే అభిప్రాయం వ్యక్తంచేసినట్టు సమాచారం. ఈ మేరకు హైదరాబాద్ అంబర్‌పేటలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీ హనుమంతరావు నివాసంలో వివిధ పార్టీలకు చెందిన మున్నూరుకాపు నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కే లక్ష్మణ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగు రామన్న, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, దానం నాగేందర్ తదితరులు హాజరయ్యారు. రాజకీయరంగంలో తమ వర్గానికి సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని వాపోయారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ రాజకీయపార్టీలకు అతీతంగా "మున్నూరుకాపుల గర్జన" పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించి ప్రభుత్వానికి తమ డిమాండ్లు తెలపాలని నేతలు నిర్ణయించినట్టు తెలిసింది. నాడు కాంగ్రెస్‌లో డీ శ్రీనివాస్, కే కేశవరావు, వీ హన్మంతరావు, పొన్నాల లక్ష్మయ్య తదితర నేతలకు దక్కిన గౌరవం నేడు కాంగ్రెస్‌లో లేదని నేతలు అభిప్రాయపడ్డట్టు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరుకాపు నేతలకు కీలక పదవులు ఇచ్చిందని, పార్టీకి విధేయతతో, సమర్థంగా పని చేశామని చెప్పారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కేసీఆర్ కూడా మున్నూరుకాపులకు సముచిత స్థానం కల్పించారని గుర్తుచేసుకున్నట్టు సమాచారం. మున్నూరుకాపులకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం ఇదే తొలిసారి అని నేతలు ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఎంపీ, ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవులు కూడా తమకు తగిన స్థాయిలో ఇవ్వలేదని సంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఎమ్మెల్యేల కోటాలో ఓ ఎమ్మెల్సీ పదవిని మున్నూరుకాపులకు ఇవ్వాలని డిమాండ్ వ్యక్తమైనట్టు తెలిసింది.

తప్పుడు లెక్కలను ఎలా సమర్థిస్తాం!

సమావేశంలో కులగణనపైనా వాడీవేడి చర్చ జరిగింది. మున్నూరుకాపుల జనాభాను తక్కువగా చేసి చూపించిన తప్పులతడక లెక్కలను సవరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యత తగ్గిస్తే.. తాము కూడా కాంగ్రెస్‌కు ప్రాధాన్యత తగ్గించటం అనివార్యం అని నేతలు తీర్మానించుకున్నట్టు తెలిసింది. ప్రభుత్వం కులగణన సమర్థంగా చేసిందని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సభ పెడదామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రతిపాదించగా మిగతా నేతలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించినట్టు తెలిసింది. అసంపూర్ణమైన కుల గణనతో మున్నూరుకాపుల సంఖ్య తగ్గించారని, ఇప్పుడు మనం కృతజ్ఞతా సభ పెడితే తప్పుడు లెక్కలను సమర్థించినట్టు అవుతుందని నేతలు వ్యతిరేకించినట్టు సమాచారం. అలాగే ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రానికి పంపించి, చేతులు దులుపుకోవద్దని, పార్లమెంటులో బిల్లు పాస్ అయ్యే వరకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కులగణన సరిగ్గా జరగలేదని, లెక్కలను సవరించాల్సిందేనని తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఈ సందర్భంగా నేతలు పలు తీర్మానాలు చేశారు.

మున్నూరుకాపు నేతల తీర్మానాలు!

- కులగణనలో తప్పులను సరిదిద్దాలి. 42శాతం రిజర్వేషన్లకు కృషి చేయాలి
- హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో త్వరలో షాంపిల్ సర్వే నిర్వహించాలని నిర్ణయం
- మున్నూరుకాపు వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలి
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక పదవిని మున్నూరుకాపులకు కేటాయించాలి
- మున్నూరుకాపు కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించి, నిధులు కేటాయించాలి
- కోకాపేటలో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.10కోట్ల నిధులు మంజూరు చేయాలి
- కాచిగూడలో విద్యార్థి వసతి గృహ అభివృద్ధికి తోడ్పడాలి
- మున్నూరుకాపుల సత్తాచాటేలా త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ

ప్రభుత్వ పనులకు టీజీఎండీసీ ఇసుక

- గనులశాఖతో సమావేశంలో రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ) ఇసుక, ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్రమాలకు అడ్డుకట్టలు వేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం రేవంత్‌రెడ్డి గనులశాఖపై సమీక్ష నిర్వహించారు. నెల రోజులుగా తీసుకున్న నిర్ణయాలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడిందని చెప్పారు. నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ నిర్మాణాలకు టీజీఎండీసీ ద్వారానే ఇసుకను సరఫరా చేయాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షను ఆచరించాలి

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలందరూ నియమనిష్ఠలు, భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షను ఆచరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈపర్వదినం మానవసేవ చేయాలనే సందేశాన్ని సమస్త మానవాళికి అందిస్తుందని పేర్కొన్నారు. ఈనెలలో ముస్లింలు ఆచరించే కఠోర ఉపవాసం, దైవప్రార్థనలు ఆధ్యాత్మికత, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు.

ఉర్దూమీడియం స్కూళ్లు, కాలేజీల పనివేళ్లలో మార్పు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలు, డైట్ కాలేజీల పనివేళలను విద్యాశాఖ మార్చింది. ఉర్దూ మీడియంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లు, డైట్ కాలేజీలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకే నడపాలని ఆదేశాలిచ్చింది. మార్చి 2 నుచి ఏప్రిల్ 1 వరకు ఈ వెసులుబాటు అమల్లో ఉంటుందని పాఠశాల విద్యాశాఖ జేడీ పీ మదన్‌మోహన్ తెలిపారు.

గ్యారెంటీలు అమలు చేయలేకనే ఆరోపణలు

- సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేకనే సీఎం రేవంత్‌రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో కేంద్రం ఏడు టెక్స్‌టైల్ పార్కులు చేస్తే తెలంగాణకు ఒకటి ఇచ్చిందని తెలిపారు. ఎన్నికల్లో హామీలిచ్చిన కాంగ్రెస్ వాటిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ఏ సామాజికవర్గం కూడా సీరియస్‌గా తీసుకునే పరిస్థితులు లేవని ఎద్దేవా చేశారు. రూ.10 లక్షల కోట్లతో రాష్ట్రంలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు ఇప్పటికే వివరించామని తెలిపారు.

మహిళా సంక్షేమంపై అధ్యయనానికి కమిటీ

- మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మహిళా సంక్షేమంపై అధ్యయనానికి ఉన్నత కమిటీని ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం సచివాలయంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలపై సీతక్క సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో మహిళా సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాల నిర్వహణపై కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. కమిటీ నివేదికతో దేశంలోనే మెరుగైన మహిళా సాధికారిత విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్లు నేరెళ్ల శారద, శోభారాణి, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, పీఆర్ డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

పైసలు పాయే.. పదవి రాకపాయే!

- లబోదిబోమంటున్న కొందరు కాంగ్రెస్ నేతలు
- పదవులు, పనుల కోసం ఓ నేతకు భారీగా చెల్లింపులు
- తీరా ఆ నేత వెళ్లిపోవడంతో నాయకుల్లో అయోమయం
- 'దీపం' బాధితుల చిట్టా పెద్దదేనంటూ జోరుగా చర్చ

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): 'దీపం' ఉండగానే చక్కదిద్దుకుందామనుకున్న కొంత మంది కాంగ్రెస్ నేతల ఆశలు అడియాశలయ్యాయి. సడన్‌గా సదరు కీలక నేత వెళ్లిపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. 'పైసలు పాయే.. పని కాకపాయే.. పదవి రాక పాయే' అంటూ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. ఇలా ఒక్కరో.. ఇద్దరో కాదు బాధితుల చిట్టా పెద్దగానే ఉందనే చర్చ కాంగ్రెస్‌లో జోరుగా జరుగుతున్నది. 'మీకు ఏది కావాలో చెప్పండి చేసి పెడతా అంటూ' అందర్నీ నమ్మించినట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఇంకేముంది 'మీకు కావాల్సింది మీకిస్తాం.. మాకు కావాల్సింది మాకివ్వండి అనేలా' ఇద్దరి మధ్య ఒప్పందాలు జరిగిపోయాయి. కీలక నేత హామీదారుగా ఉండటంతో ఇక తమ పనైపోయిందనేలా నేతలంతా సంతోషంలో మునిగితేలారు. కానీ ఇప్పు డు వారందరికీ ఊహించని షాక్ తగిలింది.. సదరు నేతను బాధ్యతల నుంచి తప్పించడంతో, ఇక్కడి నేతల బాధ వర్ణనాతీతంగా మారింది.

కాంగ్రెస్‌లో పదవులంటేనే..

కాంగ్రెస్‌లో పదవులు దక్కాలన్నా, పనులు కావాలన్నా అంత తేలిక కాదనే చర్చ గతంలోనే ఉంది. ఇప్పుడు అధికారంలో ఉంది కాబట్టి మరింత కష్టంగా ఉంటుంది. ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో పదవులు ఆశించిన నేతలకు ఓ కీలక నేత ఆశా'దీపం'లా కనిపించారు. ఇక ఇంకేముంది.. ఆ నేతకు భారీ మొత్తంలో ముట్టజెప్పినట్టుగా ప్రచారం జరుగుతున్నది. పదవులను బట్టి చెల్లింపుల కార్యక్రమం చేపట్టినట్టుగా తెలుస్తున్నది. కొందరైతే కొట్లలోనే ముట్టజెప్పినట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఎమ్మెల్యేలు, బడా నేతలు కూడా ఇందులో ఉన్నట్టు చర్చ సాగుతున్నది. ఇక ఇటీవల ఆ నేతను బాధ్యతల నుంచి తప్పించడంతో తమ పరిస్థితి ఏంటని నేతలు మదనపడుతున్నట్టుగా సమాచారం. ఇప్పుడీ వ్యవహారం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

కొత్తగా వచ్చేవారికి పదవులివ్వొద్దు

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో చోటివ్వాల్సిందే..
- జిల్లా అభివృద్ధి కోసం అవసరమైతే రాజీనామా
- కులమే అడ్డనుకుంటే. బీసీ అభ్యర్థిని నిలబెట్టిగెలిపించుకుంటా..
- పార్టీ లైన్ క్రాస్ చేయొద్దనే కొన్ని విషయాలు బయటకు చెప్పట్లే
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంచలన వ్యాఖ్యలు

రంగారెడ్డి, మార్చి 1 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గాంధీభవన్‌లో శుక్రవారం చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చే వారిని గౌరవించడం సబబే..కానీ పదవులివ్వొద్దంటూ ఆయన నేరుగా వ్యాఖ్యానించారు. అధికారంలో లేనప్పుడు కష్టపడిన నాయకులకు గుర్తింపునివ్వాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 41శాతం ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో చోటివ్వాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లు పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించాలని కోరారు. మంత్రివర్గంలో చోటివ్వడానికి సామాజికవర్గమే అడ్డు వస్తే బీసీలో ఏ నాయకుడి పేరు చెప్పినా ఇబ్రహీంపట్నం నుంచి గెలిపిస్తానని చెప్పారు. జిల్లా అభివృద్ధి కోసం అవసరమైతే రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. గ్రేటర్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఆరు మంత్రి పదవులు గ్రేటర్ పరిధిలోనే ఉండేవని గుర్తు చేశారు. ఇక పార్టీ లైన్ దాటొద్దని, కొన్ని విషయాలు బయటకు మాట్లాడటం లేదని ఆయన అనడం వెనుక ఏదో విషయమే ఉంటుందనే చర్చ పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇస్తేనే పార్టీ బలోపేతమౌతుందని, లేదంటే గ్రేటర్‌లో ఇబ్బందులు తప్పవని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

గజ్వేల్‌లో మాట్లాడుతున్న మల్లారెడ్డి, నాయిని యాదగిరి

ఏఎంసీ పదవి కోసం 1.60 కోట్లు ఇచ్చా!

- కాంగ్రెస్ మనోహరాబాద్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి

గజ్వేల్, మార్చి 1 : ఏఎంసీ పదవి ఇప్పిస్తానంటే గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి రూ.1.60 కోట్లు ఇచ్చానని కాంగ్రెస్ మనోహరాబాద్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన వద్ద డబ్బులు తీసుకుని తీరా అన్యాయం చేశాడని, ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలతో బయట పెడుతానని తెలిపారు. పార్టీ కోసం ఎకరం భూమి అమ్మినట్టు తెలిపారు. తన దగ్గర డబ్బులు తీసుకుని పట్టించుకోవడం లేదన్నారు. తనకు న్యాయం జరగకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద విషం డబ్బాతో కూర్చుంటానని హెచ్చరించాడు. టీపీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి మాట్లాడుతూ.. గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీకి 33 వేల ఓటు బ్యాంకు ఉంటే నర్సారెడ్డికి డిపాజిట్ దక్క లేదని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నీలం మధు పంపిన డబ్బులను తీసుకుని ఆయన ఓటమికి కారణం అయినట్టు ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎవరెవరి దగ్గర ఎన్ని డబ్బులు తీసుకున్నారో తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని, మీనాక్షినటరాజన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

నేడు ఐఐటీ హైదరాబాద్‌కు ఉపరాష్ట్రపతి రాక

కంది, మార్చి 1: ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ ఆదివారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌కు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. శనివారం కలెక్టర్ వల్లూరు క్రాంతి ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో కలిసి ఐఐటీలోని హెలీపాడ్, సమావేశ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రోటోకాల్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెన్షన్

- రెడ్డి సామాజికవర్గాన్ని దూషించినందుకు క్రమశిక్షణ చర్య

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ సస్పెన్షన్ వేటు వేసింది. ఆ పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్, మాజీ మంత్రి జీ చిన్నారెడ్డి ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పదేపదే విమర్శలు చేస్తున్నారని, దీనిని పార్టీ వ్యతిరేక చర్యగా దృష్టిలో ఉంచుకుని ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని క్రమశిక్షణా కార్యాచరణ కమిటీ నిర్ణయించిందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొంతకాలంగా తీన్మార్ మల్లన్న బీసీ నినాదంతో దూకుడు రాజకీయాలు చేస్తున్నారని, రెడ్డి సామాజికవర్గం నేతలను టార్గెట్ చేసి విమర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కులగణన నివేదికను బహిరంగంగా చించివేశారు. మిర్యాలగూడెం, వరంగల్‌లో జరిగిన బీసీ సభల్లో తీన్మార్ మల్లన్న తీవ్ర పదజాలంతో రెడ్డి కులాన్ని దూషించారని, అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆ సామాజికవర్గం టీపీసీసీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో మల్లన్న వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపింది. ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఈనెల 5న మల్లన్నకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలు, కులగణన నివేదికపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఈనెల12లోగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. అయితే నోటీసులకు మల్లన్న స్పందించకపోవడంతో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

అధికార పార్టీలకు ఎన్నికల కోడ్ వర్తించదా?

- సామాన్యులు, ప్రతిపక్ష పార్టీలపైనే కేసులా?
- ఎయిర్‌పోర్టు క్రెడిట్ కోసం బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీగా క్షీరాభిషేకాలు
- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల తోపులాట

మామునూరు ఎయిర్‌పోర్టు గేటు వద్ద ఒకే టెంట్ కింద కార్యక్రమాలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కరీమాబాద్ (వరంగల్), మార్చి 1 : సామాన్యులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే హడావుడి చేసే పోలీసులు అధికార పార్టీల నాయకులు ఉల్లంఘిస్తే మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. భారత రాజ్యాంగం, చట్టాలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా పోలీసులు మిన్నకుండిపోయారు. వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. ఈ క్రెడిట్ తమదంటే తమదేనని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా తమ నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు, పుష్పాభిషేకాలు చేయడంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. శనివారం మామునూరు ఎయిర్‌పోర్టు గేటు వద్ద బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించి సంబురాలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు సైతం అక్కడే సంబురాలు చేశారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను సముదాయించగా ఒకే టెంట్ కింద రెండు పార్టీల నాయకులు పుష్పాభిషేకాలు, క్షీరాభిషేకాలు చేశారు. తమ పార్టీ, అంటే తమ పార్టీ వల్లే మామునూరుకు ఎయిర్‌పోర్ట్ వచ్చిందంటూ ఉపన్యాసాలు దంచారు. మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ రమేశ్ పరిస్థితిని సమీక్షించారు. ఈ రెండు పార్టీల హంగామాను చూసి స్థానికులు పలు విమర్శలు చేశారు. 1981 వరకు సేవలందించిన ఎయిర్‌పోర్టు మూతపడిన నాటి నుంచి నేటి వరకు కేంద్రంలో ఉన్నది బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలేనని, ఇన్నాళ్లు లేనిపోయి ఇప్పుడొచ్చిందా అంటూ ఎద్దేవాచేశారు.

పేపర్ ప్లేట్లుగా కులగణన సర్వే ఫారాలు

హైదరాబాద్, మార్చి 1, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన పేరిట ఆర్భాటంగా చేపట్టిన సర్వేకు సంబంధించిన ఫారాలు పేపర్ ప్లేట్లుగా రూపాంతరం చెందాయి. రాష్ట్రంలోని ఓ హోటల్‌లో ఆహారపదార్థాలు అందించేందుకు కులగణన సర్వేపేట్లను వినియోగించడం చర్చనీయాంశమైంది. ఆ హోటల్‌లో టీ కప్పుతో బిస్కెట్లను ఉంచిన పేపర్ ప్లేట్ దర్శనమిచ్చింది. ఇందుకు సంబంధించిన చిత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండంగా సర్కారు తీరుపై నెటిజన్లు సైటెర్లు వేస్తున్నారు.

హోంగార్డులపై ఆంక్షల కత్తి

▶ మొదటిపేజీ తరువాయి...

ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని చెప్తున్నారు. అసలు ఆ ఉత్తర్వులు ఏంటా అని ఆరాతీస్తే నివ్వెరపోయే వాస్తవాలు తెలుస్తున్నాయి. హోంగార్డులపై మరింత కఠినమైన ఆంక్షలు విధిస్తూ ఫిబ్రవరి 25న తెలంగాణ పోలీసుశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవైపు స్వచ్ఛంద సేవ అంటూనే రెగ్యులర్ ఉద్యోగుల కంటే దారుణంగా ఆంక్షలు విధిస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల కారుణ్య నియామకాలకు చరమగీతం పాడిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా హోంగార్డులు వరసగా 21 రోజులు విధులకు గైర్హాజరైతే సస్పెండ్ చేసే అధికారం ఆయా జిల్లాల యూనిట్ ఆఫీసర్లకు ఇచ్చింది. వెంటనే వారిపై ఎస్బీ విచారణకు ఆదేశించేలా ఏర్పాట్లు చేసింది. దీంతో ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న చాలామంది హోంగార్డులు తమ ఉద్యోగాలు వదులుకోకతప్పని పరిస్థితి నెలకొంది. ఇటీవలి జీవోలో రాష్ట్ర ప్రభుత్వం పరేడ్ అలవెన్స్‌ను రూ.200 ఇస్తున్నామని చెబితే ఫిబ్రవరి 25న ఇచ్చిన సర్క్యూలర్ మెమోలో రూ.100 అని పేర్కొంది. కమిటీ పేరుతో చేయని తప్పులకు తమను రోడ్డుపాలు చేస్తారేమోనని హోంగార్డులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పోలీసుశాఖ మెమోలోని ముఖ్యమైన అంశాలు

1) 21 రోజుల నిబంధన

హోంగార్డు 21 రోజుల పాటు అనధికారంగా గైర్హాజరైతే లేదా 3 నెలల వ్యవధిలో 21 రోజుల కంటే ఎక్కువగా అబ్సెంట్ అయితే, లేదా ముఖ్యమైన బందోబస్తు విధులకు క్రమం తప్పకుండా గైర్హాజరైతే అతను యూనిట్ అధికారి/డీసీపీ ప్రధాన కార్యాలయం/డీసీపీ (పరిపాలన) ద్వారా సస్పెండ్ అవుతారు. హోంగార్డు 10 రోజులలోపు వివరణను సమర్పించాలి. సంబంధిత అధికారి ఆ వివరణతో సంతృప్తి చెందితే, హోంగార్డును విధుల్లోకి తీసుకుంటారు. లేకపోతే క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేయడానికి విషయం ముఖ్య కార్యాలయానికి పంపిస్తారు.

2) హోంగార్డుల క్రిమినల్ కార్యకలాపాలు/దుష్ప్రవర్తన/ ఎఫ్ఐఆర్ వంటి అంశాలు

హోంగార్డు యూనిట్ అధికారి/డీసీపీ ప్రధాన కార్యాలయం/డీసీపీ (పరిపాలన) ద్వారా సస్పెండ్ అవుతారు. ఆ తర్వాత విచారణకు ఆదేశిస్తారు. సంబంధిత అధికారి నుంచి షోకాజ్ నోటీసు జారీ చేస్తారు. హోంగార్డు 10 రోజులలోపు వివరణను సమర్పించాలి. ఆ వివరణతో అధికారి సంతృప్తి చెందితే, ఆ అధికారి నేరం చాలా తీవ్రంగా లేదని భావిస్తే చర్యలు నామమాత్రంగా ఉంటాయి. ఒకవేళ హోంగార్డు వివరణ పంపకపోతే, పంపిన వివరణపై అధికారి సంతృప్తి చెందకపోతే వెంటనే క్రమశిక్షణ చర్యల కమిటీకి విషయం తెలియజేస్తారు. ఆ క్రమశిక్షణా కమిటీ కేసును సమీక్షిస్తుంది.

3) గైర్హాజరీని ఎలా పరిశీలించాలి?

ఐదు రోజులకు పైగా హోంగార్డులు గైర్హాజరు అయితే ఎప్పటికప్పుడు ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపాలి. ప్రతినెలా 24వ తేదీలోపు హోంగార్డుల హాజరు, గైర్హాజరీని హెచ్‌జీవో కార్యాలయానికి సమర్పించాలి. నెలలో రెండు రోజులు హోంగార్డులను కవాతుకు పంపాలి. ఆ బాధ్యత సంబంధిత అధికారులదే. ఈ కఠిన నిబంధనలతో హోంగార్డులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

కొచ్చి తరహాలో విమానాశ్రయం : సీఎం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): వరంగల్ మామునూరు విమానాశ్రయం కొచ్చి ఎయిర్‌పోర్ట్ తరహాలో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన శనివారం మామునూరు ఎయిర్‌పోర్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయ పనులు వేగంగా జరగాలని నిర్దేశించారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించి భూసేకరణ, పెండింగ్ అంశాల వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెల